నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 25 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

జోడేఘాట్‌కు మధ్యప్రదేశ్ ఆదివాసులు

కుమ్రం భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న మధ్యప్రదేశ్ ఆదివాసులు

కెరమెరి, డిసెంబర్ 24 : మండలంలోని పర్యాటక ప్రాంతమైన జోడేఘాట్ గ్రామాన్ని మధ్యప్రదేశ్‌కు చెందిన ఆదివాసులు మంగళవారం సందర్శించారు. అడవి బిడ్డల హక్కుల సాధన కోసం పోరాడి అమరుడైన కుమ్రం భీం విగ్రహం, సమాధి వద్ద పూజలు చేసి నివాళులర్పించారు. అనంతరం మ్యూజియాన్ని సందర్శించి, దేవతల ప్రతిమలను పరిశీలించారు. భీం పోరాట స్ఫూర్తి చాలా గొప్పదని, ఆ అమరుడి ఖ్యాతి ప్రపంచానికి తెలిసేలా ఇక్కడ కేసీఆర్ ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టిందని వారు కొనియాడారు. ఈ సందర్భంగా కుమ్రం భీం మనుమడు కుమ్రం సోనేరావ్, గ్రామ పటేల్ పెందోర్ రాజేశ్వర్, మ్యూజియం క్యూరేటర్ దుందెరావ్ వారితో కలిసి పలు అంశాలపై చర్చించారు.

తాండూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ

తాండూర్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

తాండూర్, డిసెంబర్24 : తాండూర్ లోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం మంచిర్యాల డీసీపీ భాస్కర్ తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న క్రైమ్ రేట్ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నేరాల అదుపునకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. శాంతి భద్రతల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణతో పాటు గదులను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, సీఐ కుమార్ స్వామి, ఎస్ఐలు కిరణ్‌కుమార్, సౌజన్య ఉన్నారు.

చెలిమెల కాలువలు పారేదెలా!

ఎన్‌టీఆర్ సాగర్ ప్రాజెక్టు నిర్వహణ అస్తవ్యస్తం

- కాలువల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు
- కానరాని మరమ్మతులు
- యాసంగి సాగుపై ఆశలు వదలుకొంటున్న రైతులు
- ఈ యేడాది 80 ఎకరాలూ కష్టమే..
- కేసీఆర్ సర్కారులో రంది లేకుంట పంటలు తీసిన అన్నదాతలు
- కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు

ఎన్‌టీఆర్ సాగర్ (చెలిమెల) ప్రాజెక్టు

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : తిర్యాణి మండల కేంద్రం సమీపంలోని చెలిమెల వాగుపై నిర్మించిన ఎన్‌టీఆర్ సాగర్ (చెలిమెల) ప్రాజెక్టు రైతులకు ఉపయోగపడకుండా పోతున్నది. ప్రాజెక్టు నిర్వహణ అస్తవ్యస్తంగా మారడం.. కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో ఉన్న కొద్దిపాటి పంటలకు కూడా సాగునీరందించలేని దుస్థితి నెలకొంటోంది. వానకాలంలో ఎలాగోలా తంటాలు పడి పంటలు తీయగా, యాసంగి మాత్రం సాగు చేసే పరిస్థితి కనిపించడం లేదని రైతాంగం భావిస్తున్నది.

కాలువల్లో ఏపుగా పిచ్చిమొక్కలు

చెలిమెల ప్రాజెక్టు నిర్వహణ సరిగా లేకపోవడం.. కాలువల్లో చెత్తా చెదారంతో పాటు ఏపుగా పిచ్చిమొక్కలు పెరగడంతో పంటలకు నీరందే పరిస్థితి లేదు. దీంతో యాసంగి సాగుపై రైతులు ఆశలు వదులుకుంటున్నారు. యేటా యాసంగిలో ఈ ప్రాజెక్టు కింద దాదాపు 200 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. కానీ ప్రస్తుతం కాలువల పరిస్థితిని బట్టి చూస్తే 80 ఎకరాలు కూడా సాగయ్యేలా కనిపించడం లేదు. కనీసం మోటార్ల ద్వారానైనా పంటలకు నీరు పెడుదామంటే కరెంటు ఉండే గ్యారంటీ లేదు. దీంతో రైతులు సాగు చేసేందుకు సాహసం చేయడం లేదు.

కేసీఆర్ సర్కారులో..

కేసీఆర్ ప్రభుత్వంలో కాలువలను ఆధునీకరించడంతో రైతులు రంది లేకుంట పంటలు తీశారు. వర్షాలు లేనప్పుడు పంట కాలువల ద్వారా 24 గంటల ఉచిత విద్యుత్‌ను వినియోగించుకున్నారు. యేటా 200 ఎకరాల్లో పంటలు వేశారు. గతేడాది 180 ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి 80 ఎకరాలు కూడా సాగయ్యే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చెలిమెల ప్రాజెక్టు కాలువలకు మరమ్మతులు చేసి సాగు నీరందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పిచ్చిమొక్కలతో నిండిపోయిన చెలిమెల ప్రాజెక్టు కాలువ

రైతు భరోసా ఎగ్గొటేందుకు కుట్ర

పీఎం కిసాన్ సమ్మాన్ రైతులకే భరోసా సాయం ఇచ్చే అవకాశం

- ఉమ్మడి జిల్లాలో 6.19 లక్షల నుంచి 2.74 లక్షలకు తగ్గనున్న లబ్ధిదారులు
- 3.44 లక్షల మంది రైతులకు భరోసా లేనట్లే..

మంచిర్యాల, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కేసీఆర్ సర్కారు రైతుబంధు రూపంలో ఇచ్చిన పంట పెట్టుబడి సాయాన్ని రైతు భరోసా పేరిట ఇస్తామంటూ ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి యేడాదైనా ఆ ఊసెత్తడం లేదు. ఎకరానికి రూ.15 వేల చొప్పున ఇస్తామంటే పెట్టుబడి సాయం పెరుగుతుందని రైతులు ఆశపడ్డారు. కానీ.. ఇచ్చే మొత్తం పెంచినట్టే పెంచి నిబంధనల పేరిట సగానికి కంటే ఎక్కువ మంది రైతులకు రైతు భరోసా ఎగ్గొట్టేందుకు కుట్ర చేస్తుందని రాజకీయ, వ్యవసాయ రంగ నిపుణులు చెప్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా పడే రోజు స్వల్పకాలిక చర్చ పెట్టి విధివిధానాలు ఏంటో చెప్పకుండానే ముగిం చేశారు. కాకపోతే ఈ చర్చలో కేంద్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిబంధనలను అసెంబ్లీలో పెట్టారు. దీంతో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద లబ్ధిపొందున్న రైతులకు మాత్రమే రైతు భరోసా వస్తుందనే చర్చ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. అదే జరిగితే రాష్ట్రంలో 40 లక్షల మంది రైతులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 3.44 లక్షల మంది రైతులు రైతు భరోసాకు దూరమవుతారని ప్రస్తుత గణాంకాలు చెప్తున్నాయి

నిబంధనల పేరిట కోత

నిబంధనల పేరిట రుణమాఫీ ఇవ్వకుండా రైతులకు మొండిచేయి చూపించారో.. అదే తరహాలో రైతు భరోసా పథకాన్ని కొందరికీ వర్తింప చేస్తారని సమాచారం. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిబంధనలే రైతు భరోసాకు వర్తింప చేస్తే దాదాపు గతంలో 70 లక్షల మందికి ఇచ్చిన రైతుబంధు 30 లక్షల మందికి ఇస్తే సరిపోతుంది. ప్రతి సీజన్‌కు అప్పుడు రూ.15 వేల కోట్లు ఖర్చుపెడితే ఇప్పుడు కేవలం సీజన్‌కు 5 వేల కోట్ల లోపు ఇస్తే సరిపోతుందని భావిస్తున్నది. ఈ విషయాన్ని నేరుగా చెప్పలేక సీఎం రేవంత్‌రెడ్డి గుట్టలు, బండరాళ్లు, రోడ్లకు రైతుబంధు ఇచ్చారంటూ ముందే కవర్ చేసుకున్నారని.. తాము చేసే మోసాన్ని కప్పిపుచ్చి ప్రతిపక్షంపై విమర్శలతో సరిపెట్టారని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ లెక్కన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 6.19 లక్షల మందికి రావాల్సిన పెట్టుబడి సాయం 2.74 లక్షల మందికి మాత్రమే వస్తుందని అంచనా వేస్తున్నారు. పీఎం కిసాన్ నిబంధనలు అమలు చేస్తే ఇంట్లో ఒక్క రైతుకు మాత్రమే పెట్టుబడి సాయం వస్తుంది. ఇంట్లో ఇద్దరి ముగ్గురి పేరుపై భూమి ఉంటే అందులో ఒక్కరికే రైతు భరోసా ఇస్తారు. రుణమాఫీ మాదిరిగానే కనీసం రెండేండ్లు ఐటీ కట్టిన వారికి రైతు భరోసా రాదు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, అర్కిటెక్ట్స్, ఇతర ప్రొఫెషన్స్‌లో ఉన్నవారెవరికీ రైతు భరోసా రాకుండా పోతుంది.

యాసంగి పంట వేయనోళ్లకు కోతే..

వానకాలంలో సాగు చేసి యాసంగిలో సాగు చేయని భూములకు రైతు భరోసా ఇవ్వరనే చర్చ వినిపిస్తున్నది. ఎందుకంటే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇటీవల శాసనసభలో అందించిన వివరాల్లో యాసంగిలో సాగు చేయని భూములను సాగులో లేని భూముల కింద చూపించారు. ఇదే జరిగితే రైతు భరోసాకు అర్హులయ్యే రైతులు సంఖ్య ప్రస్తుతం ఉన్న దానిలో 30 శాతానికి పడిపోయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని నిపుణులు అంటున్నారు. అరకొర రుణమాఫీ చేసి అర్హులైన వారికి ఎందుకు రాలేదంటే చేతులు ఎత్తేసిన కాంగ్రెసోళ్లు.. రైతు భరోసా పేరిట మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని రైతులు, రైతు సంఘాల నాయకులు మండిపడుతున్నారు. కేసీఆర్ సర్కార్‌లో ఉమ్మడి జిల్లాలో 6.19 లక్షల మంది రైతులకు ప్రతి సీజన్‌లో రూ.880.34 కోట్లు ఇచ్చింది. అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

అందరికీ రైతు భరోసా ఇవ్వాలి..

రుణమాఫీ అని చెప్పి కొందరు రైతులకు చేయనేలేదు. ఎందుకు చేయలేదంటే సాంకేతిక కారణాలు అంటున్నారు. ఇప్పటికీ అన్ని రకాలుగా అర్హులైన రైతులకు మాఫీ అవుతుందో లేదో స్పష్టత లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతు భరోసా కూడా కొందరికే వస్తుందని వార్తా కథనాలు వస్తున్నాయి. నాకు తెలిసి రైతుల్లో సగం మందికి పీఎం కిసాన్ కింద డబ్బులు వస్తలేవు. కానీ రైతు బంధు వచ్చింది. ఇప్పుడు వారందరికీ రైతు భరోసా కూడా ఇవ్వమనడం సరికాదు. రైతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలి. కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఇచ్చినట్లే రైతులందరికీ రైతు భరోసా అందేలా చూడాలి.

- అన్నె సమ్మయ్య పటేల్, చెన్నూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్.



జిల్లాలో రైతుబంధు, పీఎం కిసాన్ లబ్ధిదారుల వివరాలు..		
జిల్లా	రైతుబంధు పొందిన రైతులు(లక్షల్లో)	పీఎం కిసాన్ పొందిన రైతులు
ఆసిఫాబాద్	1.31	34,827
ఆదిలాబాద్	1.46	95,138
నిర్మల్	1.89	88,000
మంచిర్యాల	1.53	56,065
మొత్తం	6.19	2,74,030

వెటర్నరీ హాస్పిటల్ వెలవెల

పశువైద్యశాల సిబ్బంది లేక వెళ్లిపోతున్న స్థానికులు

లక్షెట్టిపేట, డిసెంబర్24 : పట్టణంలోని పశు వైద్యశాల.. సిబ్బంది లేక వెలవెలబోతున్నది. వెటర్నరీ ఏడీ అనారోగ్యంతో సెలవులు పెట్టడంతో వెటర్నరీ అసిస్టెంట్‌తో పాటు అటెండర్ మాత్రమే విధుల్లో ఉంటున్నారు. మంగళవారం వెటర్నరీ అసిస్టెంట్ సెలవు పెట్టడం.. అటెండర్ దవాఖాన ఓపెన్ చేసి సొంత పనిమీద జిల్లా కేంద్రానికి వెళ్లడంతో ఖాళీగా కనిపించింది. పశువులను చూపించేందుకు దవఖానకు వచ్చిన రైతులు, తదితరులు గంటల తరబడి వేచి చూసి.. తిరిగి వెనుదిరగాల్సి వచ్చింది. ఈ విషయమై వెటర్నరీ అసిస్టెంట్ గంగమల్లును వివరణ కోరగా.. సెలవులో ఉన్నానని తెలిపారు.

శ్రీ గీతా భవన్ హోటల్‌కు నోటీసులు

శ్రీ గీతా భవన్ హోటల్ నిర్వాహకుడికి నోటీసులు అందజేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి వాసురామ్

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 24 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పలు బేకరీలు, ఫుడ్ కోర్టులు, హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మంచిర్యాల జిల్లా ఫుడ్ కంట్రోలర్ అధికారి వాసురామ్ సిబ్బందితో కలిసి తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్టాండ్ ఏరియాలోని శ్రీ గీతా భవన్ హోటల్లో కస్టమర్ ఆర్డర్ ఇచ్చిన టిఫిన్‌లో వచ్చిన స్టీల్ స్క్రబ్బర్ ముక్కపై హోటల్‌ను తనిఖీ చేసి నిర్వాహకులకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు. లక్ష్మీ థియేటర్ ఏరియాలో ఉన్న పలు బేకరీల్లో కాలపరిమితి దాటిన ముడి పదార్థాలను గుర్తించామన్నారు. వాటిని సీజ్ చేసి ల్యాబ్‌కు పంపించనున్నట్లు పేర్కొన్నారు. వాటిపై తదుపరి చర్యలుంటాయన్నారు. నిర్వాహకులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రిస్మస్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

- కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 24 : ఈ నెల 25న నిర్వహించే క్రిస్మస్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎం గార్డెన్‌లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన వేడుకల్లో జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి రమాదేవితో కలిసి కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ సమాజంలోని అన్ని మతాలను గౌరవించాలని, యేసు ప్రభువు చూపిన మార్గంలో నడవాలన్నారు. యువత సన్మార్గంలో నడిచి తమ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, ప్రజాప్రతినిధులు, చర్చి ఫాదర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త మెనూ ప్రకారం భోజనమందించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 24: ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం బాబాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ మైనారిటీ బాలికల పాఠశాల-కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. వంటశాల, ఆహార సామగ్రి నాణ్యత, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల పెంచిన డైట్ చార్జీల ప్రకారం విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, కాలం చెల్లిన వస్తువులను ఉపయోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, గురుకుల ప్రిన్సిపాల్ గిర్ధవార్ పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

భిక్షాటన చేసి నిరసన

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 24: తమను రెగ్యులర్ చేసి.. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె 15వ రోజుకు చేరుకున్నది. మంగళవారం ఉద్యోగులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పెద్దపల్లి కిషన్‌రావు, జిల్లా అధ్యక్షుడు దేవ భూషణం, సభ్యులు సంఘీభావం తెలిపి రూ. 15 వేల విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు శృతికా, తుకారాం, నాగసుధ, నగేశ్, గేడెకార్ సంతోష్ ఉన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

కుట్టు మిషన్లు పంపిణీ చేసిన ఎస్పీ

జైనూర్, డిసెంబర్ 24: జైనూర్ మండలం కేంద్రంలో 30 మంది ఆదివాసీ మహిళలకు ఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మహిళలు విద్య, ఉద్యోగ రంగాలతో పాటు స్వయం ఉపాధిలోనూ రాణించాలన్నారు. నిరుద్యోగులకు తమవంతు సాయంగా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో జైనూర్ సీఐ రమేశ్, ఎస్ఐలు రమేశ్, రామరావు, రామకృష్ణరావు తదితరులు ఉన్నారు.

గోలేటికి చేరుకున్న ప్రజా రగ్ జోళ్ యాత్ర


దీక్ష గురువు ప్రేమ్‌సింగ్ మహారాజ్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

రెబ్బెన, డిసెంబర్ 24: తెలంగాణ రాష్ట్రంలోని గిరిజనులపై జరుగుతున్న అన్ని రకాల దాడులను అరికట్టాలని, గిరిజన చట్టాలను కాపాడాలని కోరుతూ సేవాలాల్ సేన ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రజా రగ్ జోళ్ యాత్ర మంగళవారం రెబ్బెన మండలంలోని గోలేటి గ్రామానికి చేరుకున్నది. మహిళలు మంగళహారతులతో తరలివచ్చి స్వాగతం పలికారు. సేవాలాల్ దీక్ష గురువు ప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి భోగ్‌బండార్ పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రేమ్‌చంద్‌నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబునాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు గుగులోత్ రవినాయక్, రాఘురాంనాయక్, రవిరాథోడ్, రాష్ట్ర రైతు అధ్యక్షుడు అజ్మీర తిరుపతి, కార్యదర్శి లావుడ్య మోహన్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు రూప్లానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ జర్పుల తిరుపతినాయక్, గ్రామపెద్దలు అజ్మీర బలరాంనాయక్, లావుడ్య దుప్పనాయక్, రాజునాయక్, కున్సోత్ భిక్కునాయక్, అజ్మీర బాబురావునాయక్, బానోత్ దేవయ్య, అజ్మీర రామారావు, లావుడ్య రమేశ్, కుల సంఘాల నాయకులు అక్కేవార్ దయాకర్, కేసరి కిషన్‌గౌడ్, చాపిడి గణేశ్, కృష్ణ, ఎర్రం తిరుపతి తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌కుమార్ దీపక్

నస్పూర్, డిసెంబర్ 24 : జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 326 కొనుగోలు కేంద్రాలు కేటాయించి 317 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నారన్నారు. రబీ సీజన్ కోసం డీఏపీ, ఎరువులు, ఇతర అవసరమైన వాటిని అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డీఏవో కల్పన, జిల్లా ఉద్యానవన అధికారి అనిత, డీఆర్‌డీవో కిషన్, జిల్లా పౌరసరఫరా అధికారి బ్రహ్మారావు, మేనేజర్ శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక రుణ లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

జిల్లా వార్షిక రుణ లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేలా బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం డెబోజిత్ బౌరా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం సురేశ్, నాబార్డు డీడీఎం అబ్దుల్ రవూఫ్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ మురళీమోహన్‌రావుతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. సకాలంలో రుణాలు చెల్లించి కొత్త రుణాలు పొందేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.